సాక్షి
అనంతపురం
శనివారం | 9 | డిసెంబర్ | 2023



పక్కాగా మెనూ అమలు

కేజీబీవీల్లో మెనూ పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించనున్నారు. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.1°/ 19.6°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి కొనసాగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ పోస్టర్లను మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ శుక్రవారం సాయంత్రం కళ్యాణదుర్గంలోని క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులూ సమకూర్చుతున్నట్లు డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, జిల్లా శాప్ రెజ్లింగ్ కోచ్ రాఘవేంద్ర, షటిల్ శాప్ కోచ్ నరేష్, ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ కోఆర్డినేటర్ చల్లా కిరణ్ చౌదరి మంత్రికి తెలియజేశారు. కార్యక్రమంలో స్టేడియం ఇన్‌చార్జ్ మద్దిలేటి, మండల కో ఆర్డినేటర్ రమేష్, రాజగోపాల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

11న పెన్షన్ అదాలత్

అనంతపురం సిటీ: ఈ నెల 11న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కడప రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 గౌరవ్ మహల్వాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈపీఎస్–1995 పెన్షనర్లు/సభ్యులకు ఈపీఎస్ నిబంధనలు అర్థం చేసుకోవడానికి, తమ ఫిర్యాదులు పరిష్కరించుకోవడానికి ఈపీఎఫ్‌ఓ అధికారులతో సన్నిహితంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో వెబెక్స్ వేదికగా పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు అందులో పేర్కొన్నారు. పెన్షనర్లతో పాటు మరో మూడు నెలల్లో పెన్షనర్లు కానున్న ఈపీఎస్ సభ్యులు తమ సమస్యలను పెన్షన్ అదాలత్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఆసక్తి గల వారు లింక్ ద్వారా పాల్గొన వచ్చని సూచించారు.

https://meetingsapac.webex.com/meetingsapac19/j.php?MTID=m12aa29Oa15c003b2fc77f89648288c83

మీటింగ్ నంబర్ : 2642 982 5904
పాస్వర్డ్ : 12345
తేదీ : 11.12.2023
సమయం : ఉదయం 11.00 గంటలు

సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ సెక్రటరీ జోజిరెడ్డి

అనంతపురం: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక కోసం శుక్రవారం సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ జోజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనంతలక్ష్మి కళాశాలకు జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్ధారించిన విధంగా సాఫ్ట్‌బాల్ ట్రయల్స్ నిర్వహించే బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంత రాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పరుగు

- చిన్న పరిశ్రమలే పెద్ద ప్రాణం..
- జిల్లాలో ఉత్పత్తి, సేవలు, ట్రేడింగ్ రంగాల్లో దూకుడు
- మూడేళ్లలో జిల్లాలో భారీగా నమోదైన పెట్టుబడులు
- ఒక్క ఏడాదిలోనే సేవా రంగంలో 1,635 యూనిట్ల ఏర్పాటు
- నూతన పారిశ్రామిక పాలసీతో పెట్టుబడిదారులకు రాయితీలు

జిల్లాలో పారిశ్రామిక రంగం పురోగతి దిశగా పయనిస్తోంది. విరివిగా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ప్రభుత్వ నూతన పారిశ్రామిక పాలసీతో పెట్టుబడిదారులకు భారీగా రాయితీలు లభిస్తున్నాయి. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు చాలామంది ముందుకు వస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం : చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సర్కారు పెద్దపీట వేస్తోంది. జిల్లాల పునర్విభజన తర్వాత పరిశ్రమలన్నీ శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా యంత్రాంగం ముఖ్యంగా చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలపై దృష్టి సారించింది. ఉత్పత్తిరంగంపైనే కాకుండా సేవలు, వర్తక రంగాల్లోనూ ప్రోత్సాహాలు ఇస్తుండటంతో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి సేవల రంగంలో ఎక్కువ ఆర్థిక భరోసా ఇస్తున్నారు.

ప్రభుత్వం నుంచి భారీగా రాయితీలు

సర్కారు నుంచి వివిధ వర్గాలకు భారీగా పెట్టుబడి రాయితీలు లభిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు తయారీ రంగంలో 45 శాతం లేదా గరిష్టంగా రూ.1.20 కోట్ల పెట్టుబడి రాయితీ వస్తోంది. జనరల్, బీసీ, మైనార్టీలకైతే 15 శాతం లేదా గరిష్టంగా రూ.20 లక్షలు వస్తోంది. భూముల కొనుగోలుపై అన్ని వర్గాలకు స్టాంపు డ్యూటీ పూర్తిగా మినహాయించారు. కరెంటు వినియోగంలో ఎస్సీ, ఎస్టీలకు యూనిట్‌కు 50 పైసల నుంచి రూపాయి మాత్రమే ఉంటోంది. బీసీలకు రూపాయి ఉంటుంది. ఇక సేవా రంగంలో పెట్టుబడి రాయితీలు 45 శాతం లేదా గరిష్టంగా రూ.75 లక్షల వరకూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇస్తున్నారు. బీసీలు, మైనార్టీలకు 15 శాతం లేదా రూ.20 లక్షల వరకు పెట్టుబడి రాయితీ ఉంటుంది.

16,432 మందికి ఉద్యోగ ఉపాధి

అనంతపురం జిల్లాలో ఉత్పత్తి, సేవలు, ట్రేడింగ్ రంగాల ద్వారా 16 వేల మంది పైచిలుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఎక్కువగా ఉత్పత్తి, సేవల రంగంలో లబ్ధి పొందారు.



గుత్తిలో నిర్వహిస్తున్న ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ

గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఇలా..

సంవత్సరం	యూనిట్ల ఏర్పాటు	పెట్టుబడులు	ఉద్యోగ/ఉపాధి సంఖ్య
ఉత్పత్తి రంగం			
2019-20	136	రూ.55.88 కోట్లు	1,216
2020-21	54	రూ.22.33 కోట్లు	467
2021-22	220	రూ.36.05 కోట్లు	1,229
2022-23	418	రూ.87.14 కోట్లు	2,367
సేవల రంగం			
2019-20	79	రూ.14.32 కోట్లు	293
2020-21	27	రూ.3.13 కోట్లు	104
2021-22	590	రూ.53.66 కోట్లు	1,728
2022-23	1635	రూ.136.65 కోట్లు	5,056
వర్తకం (ట్రేడింగ్) విభాగం			
2021-22	492	రూ.17.86 కోట్లు	1,197
2022-23	1132	రూ.36.53 కోట్లు	2,775

సేవల రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలామంది ఔత్సాహికులు పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రాయితీలు, భూమి కేటాయింపులకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ అధికారులు చెబుతున్నారు.

రూ.4లక్షల సబ్సిడీ అందుకున్నా



ఎంబ్రాయిడరీ షాపు కోసం పరిశ్రమల శాఖ కార్యాలయంలో పేరు నమోదు చేసుకున్నా. అధికారులు పరిశీలించిన తర్వాత యూనిట్‌ను మంజూరు చేశారు. దీంతో అరవిందనగర్‌లో రూ.15 లక్షల మిషనరీ ఏర్పాటు చేసుకుని ఎంబ్రాయిడరీ షాపు నడుపుతున్నా. నాతో పాటు మరో 3 కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నాను. ఇటీవలే ప్రభుత్వం నుంచి రూ.4 లక్షలు సబ్సిడీ అందుకున్నాను.

–నీలిమ, ఎంబ్రాయిడరీ షాపు నిర్వాహకురాలు, అనంతపురం

పౌల్ట్రీతో జీవనోపాధి



కూడేరు మండలం అంతరగంగ గ్రామం వద్ద రూ.20 లక్షల పెట్టుబడితో కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకుని పరిశ్రమల శాఖ అధికారులను సంప్రదించాను. సేవా రంగ విభాగంలో యూనిట్‌ను మంజూరు చేస్తూ అధికారులు సిఫార్సు చేశారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ కింద రూ.7 లక్షలు మంజూరు చేసింది. మా వద్ద ప్రత్యక్షంగా ఎనిమిది మంది, పరోక్షంగా మరో ఐదుగురు ఉపాధి పొందుతున్నారు.

– బి.కె.హరిప్రసాద్, కూడేరు

ఔత్సాహికులకు రాయితీలు

పెట్టుబడి దారులు ముందుకొస్తే పరిశ్రమల శాఖ తరఫున వారికి ప్రభుత్వం రాయితీలు ఇస్తుంది. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీలకు భారీగా రాయితీ లభిస్తుంది. నూతన పారిశ్రామిక పాలసీ ద్వారా ఈ రాయితీలు పొందొచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

11 నుంచి 'అనంత సంకల్పం'



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ అమలు చేస్తున్న 'అనంత సంకల్పం' షెడ్యూల్‌ను ఈ నెల 11 నుంచి అన్ని ఉన్నత పాఠశాలల్లో అమలు చేయాలని డీఈఓ వి.నాగరాజు ఆదేశించారు. 'అనంత సంకల్పం' మెటీరియల్ తయారీపై సబ్జెక్టు హెచ్‌ఎంలు, టీచర్లకు శుక్రవారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో వర్క్‌షాపు నిర్వహించారు. డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అనంత సంకల్పం మెటీరియల్‌ను తయారు చేయాలని సూచించారు. అన్ని స్కూళ్లలో కొరత లేకుండా సబ్జెక్టు టీచర్లను ఏర్పాటు చేశామన్నారు. త్వరగా మెటీరియల్ తయారు చేసి పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజుల అనంత సంకల్పాన్ని షెడ్యూల్ ప్రకారంగా హెచ్‌ఎం, టీచర్లు కచ్చితంగా అమలు చేయాలన్నారు. వర్క్‌షాపులో ఏడీ కృష్ణయ్య, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీసీఈబీ సెక్రెటరీ పురుషోత్తం బాబు, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల సస్పెన్షన్

అనంతపురం క్రైం: జిల్లాలో ఇద్దరు సీఐలపై వేటు పడింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న తాడిపత్రి సీఐ హమీద్‌ఖాన్‌తో పాటు బుక్కరాయసముద్రం సీఐ నాగార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని డీఐజీ స్పష్టం చేశారు.

చౌకధాన్యపు దుకాణాలపై దాడులు

అనంతపురం క్రైం: ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మునిరామయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని పలు కాలనీల్లో చౌకధాన్యపు దుకాణాలపై మెరుపు దాడులు చేశారు. స్టాకుతో పాటు తూకాలు, కార్డుదారులకు పంపిణీ చేస్తున్న విధానాలను పరిశీలించారు. అత్యధిక దుకాణాల్లో ఎక్కువ నిల్వలున్నట్లు గుర్తించారు. ఉన్న నిల్వలను జప్తుచేస్తూ కేసులు నమోదు చేశారు. అధికారుల తనిఖీల సమయంలో రేషన్ దుకాణం–2ను సంబంధిత డీలరు తాళం వేసి ఎటో వెళ్లి పోవడంతో అధికారులు ఆ దుకాణంపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నగరంలో మొత్తం ఆరు దుకాణాల్లో తనిఖీలు చేసి అన్నింటిపై కేసులు నమోదు చేశారు.

పవన్ కళ్యాణ్ పొలిటికల్ జీరో

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పొలిటికల్‌గా జీరో అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మరో మూడు నెలలు మాత్రమే గడువు ఉందంటూ పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను పైలా ఖండిస్తూ శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పవన్ మాటలు ఉత్తరకుమారుని ప్రగల్భాల్లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కోసమే పవన్ జనసేన స్థాపించాడని, 2014 నుంచి 2019 వరకు టీడీపీతోనే అంటకాగాడని అన్నారు. ఇప్పుడు మరోసారి చంద్రబాబు కోసం టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు కూడా జనసేన అభ్యర్థులకు రాలేదని విమర్శించారు. ఏపీలోనూ అదే పరిస్థితి ఉంటుందన్నారు. పవన్ నిబద్ధతలేని వ్యక్తి అని, ఆయన్ని ప్రజలు విశ్వసించబోరని పేర్కొన్నారు. ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండలాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పెన్నోబులేసు పాల్గొన్నారు.

రాయితో కొట్టాడని.. ప్రాణమే తీశాడు!

- తమ్ముణ్ని నరికి చంపిన అన్న
- శెట్టూరు మండలం కనుకూరులో ఘటన



హత్యకు గురైన కృష్ణమూర్తి

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామానికి చెందిన గొల్ల కృష్ణమూర్తి(27) సొంత అన్న చేతిలో దారుణహత్యకు గురయ్యాడు. గురువారం అర్ధ రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. చిన్నపాటి గొడవ ఈ హత్యకు దారితీయడం గమనార్హం. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గొల్ల గోపాల్, మల్లక్క దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు గొల్ల రవి, రెండో కుమారుడు కృష్ణమూర్తి, కుమార్తె భారతి ఉన్నారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారులు అప్పుడప్పుడు చిన్నపాటి గొడవలు పడేవారు. వెంటనే కలసిపోయేవారు. గురువారం ఉదయం పెద్ద కుమారుడైన రవి తన తమ్ముడి సెల్‌ఫోన్‌ను చెప్పకుండా తీసుకుని కళ్యాణదుర్గం వెళ్లాడు. విషయం తెలుసుకున్న తమ్ముడు కృష్ణమూర్తి కళ్యాణదుర్గం వెళ్లి.. సెల్‌ఫోన్ ఇవ్వాలంటూ అన్నతో గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే రాయితీసుకుని అన్న తలపై కొట్టడంతో స్వల్ప గాయమైంది. స్థానికులు గమనించి ఇద్దరినీ దండించడంతో గొడవ సద్దుమణిగింది. గాయపడిన రవిని తమ్ముడు కృష్ణమూర్తి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు.తర్వాత ఇద్దరూ ఒకే ద్విచక్ర వాహనంలో ఇంటికి చేరుకున్నారు. అయితే తమ్ముడిపై కోపం పెంచుకున్న అన్న రవి గురువారం అర్ధరాత్రి ఒకే ఇంట్లో నిద్రిస్తున్న తమ్ముడిని గొడ్డలితో విచక్షణరహితంగా నరికి చంపాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోకి వచ్చిన తల్లి మల్లక్క రక్తపు మడుగులో ఉన్న కుమారుడిని చూసి కేకలు వేసింది. హత్య విషయం తెలుసుకొన్న గ్రామస్తులు నివ్వెరపోయారు. కళ్యాణదుర్గం సీఐ నాగరాజు, బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా..నిందితుడు రవి శెట్టూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

తల్లడిల్లిన తల్లిదండ్రులు

కృష్ణమూర్తి హత్యతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబ భారమంతా తనే మోసేవాడు. తన సంపాదనతోనే చెల్లి పెళ్లి కూడా చేశాడు. తండ్రి గోపాల్‌కు మతిస్థిమితం లేదు. అన్న రవి కుటుంబ బాధ్యతలు పట్టించుకునేవాడు కాదు. కుటుంబాన్ని నెట్టుకొచ్చే కుమారుడు దారుణ హత్యకు గురికావడం, మరో కుమారుడు నిందితుడిగా జైలుపాలు కావడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది.

దొంగ ఓట్లన్నీ తెలుగు తమ్ముళ్లవే..

- మైనర్లకూ ఓటు హక్కు!
- అనుకూలురకు రెండేసి ఓట్లు
- దొంగ ఓట్ల తొలగింపునకు ససేమిరా

- ఈ బాలుడి పేరు మనేరి దేవ నంద. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామం. ఆధార్ వివరాల ప్రకారం 2007 సంవత్సరంలో పుట్టాడు. 16 ఏళ్ల వయసున్న ఈ బాలుడికి టీడీపీ కార్యకర్తలు ఓటు హక్కు కల్పించే ప్రయత్నం చేశారు.



- ఈ ఓటరు కార్డులో కనిపించే మహిళ పేరు సాయి గీత. ఈమెకు ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలోను, ఉరవకొండ మండలం 9వ వార్డులోను ఓటు హక్కు ఉంది.



- ఈ ఓటరు కార్డులో ఉన్న వ్యక్తి పేరు నరేంద్ర చౌదరి. ఈయనకు ఆత్మకూరు మండలం సిద్ద రాంపురం, అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో రెండు చోట్ల ఓటు హక్కు ఉంది.



- రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామంలో అలివేలమ్మ స్థానికంగాను, అనంతపురంలోను ఓటు హక్కు కలిగి ఉంది. అలాగే తిమ్మక్కకు గాండ్లపర్తి, అనంతపురంలో రెండు చోట్ల ఓటు హక్కు ఉంది. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా చాలా చోట్ల టీడీపీ సానుభూతి పరులు రెండు చోట్ల ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.



తెలుగుదేశం పార్టీ ఎలాగైనా అధికారంలోకి రావడం కోసం అడ్డదారులు తొక్కుతోంది. మైనర్లను ఓటర్లుగా చేర్పించడం.. అనుకూలమైన వారికి రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కల్పించడం చేస్తోంది. అవకాశమున్న చోట్ల భారీగా దొంగ ఓట్లను జాబితాలోకి చేరుస్తోంది. చేసేదంతా చేసి తమకే పాపమూ ఎరుగనట్టు వైఎస్సార్‌సీపీపైకి నెపం నెడుతోంది. జాబితాను పరిశీలిస్తే టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన దొంగ ఓట్ల దందా ఇట్టే తెలిసిపోతుంది.

ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గం తమకు కంచుకోటగా భావిస్తూ వచ్చిన టీడీపీకి 2019 ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 25వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఓటర్లు దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ప్రజల పక్షాన నిలిచి ఓటర్లను తమవైపు ఆకట్టుకోవడం మరచి.. తప్పుడుదారిని ఎంచుకున్నారు. నియోజకవర్గంలోని ఆత్మకూరుతో పాటు మరికొన్ని మండలాల్లో కొంతమంది టీడీపీ నాయకులు తమకు తగ్గిపోయిన ఓట్ల స్థానంలో బోగస్ ఓటర్ల ద్వారా భర్తీ చేసుకోవాలని భావించారు. తమకు అనుకూలంగా ఉన్నవారికి అవకాశమున్న చోట్ల డబుల్ ఓటు హక్కుకు దరఖాస్తు చేయించారు. చాలా చోట్ల అమ్మాయిలు పెళ్లిళ్లయ్యి మెట్టినిళ్లకు వెళ్లిపోయినా.. వారి ఓట్లను స్థానికంగా తొలగించకుండా అలానే ఉంచారు. అంతేకాదు పద్దెనిమిదేళ్లలోపు వయసు కలిగిన వారిని ఓటరుగా చేర్పించేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఓటరు జాబితా సవరణలోనూ దొంగ ఓట్లను తొలగించడానికి టీడీపీ నాయకులు ససేమిరా అంటుండటం గమనార్హం.

రాప్తాడు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆత్మకూరు	16,443	16,414	00	32,857
అనంతపురం రూరల్	39,453	40,085	05	79,543
రాప్తాడు	17,427	17,674	03	35,104
కనగానపల్లి	16,883	16,591	01	33,475
రామగిరి	14,514	14,020	00	28,534
చెన్నేకొత్తపల్లి	18,716	18,083	01	36,800
మొత్తం	1,23,436	1,22,867	10	2,46,313

ఓటమి భయంతోనేనా..?

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి బీడు భూములను సస్యశ్యామలం చేశారు. ఉచితంగా పొలాల్లో బోర్లు వేయించారు. రైతులు, కూలీల వలసలు తగ్గించారు. అనారోగ్యంతో ఉన్న వారిని, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పించి అండగా నిలిచారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అమ్మ డెయిరీ ఏర్పాటు చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేలా చూశారు. ప్రజల్లో ప్రకాష్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి.. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం టీడీపీకి పట్టుకుంది. ఈ క్రమంలోనే దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఓటమి నుంచి గట్టెక్కాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలోని వారికి కూడా రామగిరి మండలంలో ఓటు హక్కు కల్పించినట్లు గతంలో సాక్ష్యాలతో సహా బయటపడ్డాయి.

పేరెంట్స్ కమిటీల కొనసాగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల (పేరెంట్స్) కమిటీలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) వరప్రసాద రావు శుక్రవారం తెలిపారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు మొత్తం 1,779 ఉండగా, అందులో1,773 పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలు పని చేస్తున్నాయని వివరించారు.

2019 లో 1,2,3,4,5 ర్యాంకులతో పాటు 600 పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సంస్థ
GROUP-I,II
తేజ
రఘువీర టవర్స్, అనంతపురము
9948567527, 9490859421
హాస్టల్ కలదు

GROUP-I, II
FREE DEMO on 10-12-2023 @ 10AM
స్టేట్‌ఫేం ఫ్యాకల్టీతో తరగతుల నిర్వహణ
అనంత భవిత
లలిత కళాపరిషత్ ఎదురుగా LS టవర్స్, 2వ అంతస్తు
అనంతపురము. 7997592299

GROUP-2/GROUP-1/సచివాలయం
MEGA DEMO ON 13th December 2023 @ 10 AM
★ ఉద్యోగస్తుల కొరకు ఉదయం & సాయంత్రం Special Batch కలదు
BRIGHT
Girish Towers 3rd Floor, Sainagar 2nd Cross, ATP. 8247314733, 9441710760

మెనూ పక్కాగా అమలు

- వారంలో రెండుసార్లు కూరగాయల సరఫరా
- అన్ని కేజీబీవీలకు సమగ్ర శిక్ష అధికారుల ఆదేశాలు
- మెనూ అమలును ప్రత్యేక బృందాలతో పరిశీలించేలా ప్రణాళిక

అనంతపురం ఎడ్యుకేషన్: అనాథ, పేదింటి బాలికలు చదువుకుంటున్న కేజీబీవీల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేసేందుకు సమగ్ర శిక్ష అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బలవర్ధకమైన ఆహారం అందించేలా ప్రత్యేక మెనూ తయారు చేశారు. కొన్ని కేజీబీవీల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే ఫిర్యాదులు అందుతుండంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సమగ్ర శిక్ష ఏపీసీతో పాటు ప్రత్యేక బృందాలను నియమించి మెనూ అమలును పరిశీలించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 61 కేజీబీవీలున్నాయి. 6–10 చదువుతున్న విద్యార్థినులు 12,372 మంది, ఇంటర్ విద్యార్థినులు 3,779 మంది ఉన్నారు.

వారంలో రెండుసార్లు సరఫరా..

ఇప్పటిదాకా కేజీబీవీల్లో వారానికి సరిపడే కూరగాయలు, ఆకుకూరలు ఒకేసారి సరఫరా చేస్తున్నారు. దీంతో తొలి మూడు రోజులుగా బాగానే ఉంటున్నా.. నాల్గో రోజు నుంచి కొన్ని కూరగాయలు దెబ్బతింటున్నాయి. ఆకుకూరలు పూర్తిగా చెడిపోతున్నాయి. అదికూడా వారాంతం నాటికి కూరగాయలు క్వాంటిటీ (చెడిపోయినవి తీసేస్తుండడంతో) కూడా తగ్గిపోతున్నాయి. ఈ లోపాలను ఇటీవల అధికారుల పరిశీలనలో గుర్తించారు. ఈ క్రమంలో వారం రోజులకు సరిపడేలా కాకుండా వారంలో రెండుసార్లు కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని కేజీబీవీల్లోనూ ప్రతి మూడు రోజులకోసారి పచ్చి సరుకులు తెప్పించుకోవాలని స్పష్టం చేశారు.


బెళుగుప్ప కేజీబీవీకి సరఫరా అయిన తాజా కూరగాయలు

కేజీబీవీల్లో మెనూ ఇలా...

- ఆదివారం ఉదయం బెల్లం, పాలతో రాగిజావ, పూరి, ఆలూ బఠానీ కూర్మా, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం/ బగారన్నం, చికెన్, టమాట రసం, మజ్జిగ, సాయంత్రం సగ్గుబియ్యం బెల్లం పాయసం, రాత్రి అన్నం, వంకాయకూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- సోమవారం ఉదయం బెల్లం, పాలతో రాగిజావ, పులిహోరతో వేరుశనగ చెట్నీ, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం, పాలకూరు పప్పు, గోరుచిక్కుడు ఇగురు/ కొబ్బరిపొడి కాకరకాయ వేపుడు, ఉడకబెట్టిన గుడ్డు, రసం, మజ్జిగ, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, క్యారెట్ ఇగురు, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- మంగళవారం ఉదయం బెల్లం, పాలతో రాగిజావ, ఊతప్పం–కొబ్బరిచట్నీ, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం/రాగి సంగటి, తోటకూర పప్పు, టమాట–కోడిగుడ్డు ఇగురు, రసం, మజ్జిగ, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, దోసకాయ కూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- బుధవారం ఉదయం బెల్లం, పాలతో రాగిజావ, కిచిడీ–టమాట చట్నీ, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం, గోంగూర పప్పు, గుడ్డు ఉక్కిరి/పొరుటు, రసం, మజ్జిగ, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, బెండకాయ కూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- గురువారం ఉదయం బెల్లం పాలతో రాగిజావ, గోధుమరవ్వ ఉప్మా, పుట్నాలు చట్నీ, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం, టమాట పప్పు, దొండకాయ ఇగురు, ఉడకబెట్టి వేయించిన గుడ్డు, రసం, మజ్జిగ, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, సొరకాయ కూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- శుక్రవారం ఉదయం బెల్లంపాలతో రాగిజావ, చపాతి – ఆలుకూర, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం, మెంతికూర పప్పు, క్యాబేజీ/ కాలీఫ్లవర్ ఇగురు, ఉడకబెట్టిన గుడ్డు, రసం, మజ్జిగ, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, బీరకాయ కూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.
- శనివారం ఉదయం బెల్లం పాలతో రాగిజావ, ఇడ్లీ–పల్లీల చట్నీ, పల్లీల పట్టీ, మధ్యాహ్నం అన్నం/రాగి సంగటి, తోటకూర పప్పు, బంగాళదుంప వేపుడు, రసం, మజ్జిగ, స్వీటు, సాయంత్రం బూస్ట్ కలిపిన పాలు, రాత్రి అన్నం, కొబ్బరిపొడితో బీట్‌రూట్ కూర, సాంబారు, మజ్జిగ, అరటిపండు.

మెనూ పరిశీలనకు ప్రత్యేక బృందాలు

ఆడపిల్లలు చదువుకుంటున్న కేజీబీవీలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పౌష్టికాహారం కల్గిన మెనూను తయారు చేసింది. అన్ని చోట్లా పక్కాగా మెనూ అమలు కావాల్సిందే. సాకులు చెబితే ఉపేక్షించం. కూరగాయలు వారానికోసారి కాకుండా ప్రతి మూడు రోజులకోసారి తీసుకోవాలి. కిచెన్‌లు శుభ్రంగా ఉంచుకోవాలి. వంట మనుషులకు కచ్చితంగా డ్రస్ కోడ్ అమలు చేయాలి. మెనూ పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను నియమిస్తున్నాం.



– జూలుకుంట వరప్రసాదరావు
ఏపీసీ, సమగ్రశిక్ష

క్లుప్తంగా

మామ హత్యకేసులో అల్లుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి: మామను హత్య చేసిన ఘటనలో అల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం తాడిపత్రి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీఎం గంగయ్య ఆ వివరాలను తెలిపారు. శింగనమల మండలం కల్లుమడికి చెందిన సుంకిరెడ్డి తన రెండో కుమార్తె రాజేశ్వరిని కోమలికి చెందిన నిందితుడు మూగిరెడ్డి వీరరాఘవరెడ్డికి ఇచ్చి 22 ఏళ్ల క్రితం వివాహం జరిపించారన్నారు. వీరికి ఇద్దరు సంతానమని చెప్పారు. తన అల్లుడికి ఉన్న పొలంలో వ్యవసాయ పనులు సక్రమంగా చేసుకోకపోవడంతో కుమార్తె అభ్యర్థన మేరకు సుంకిరెడ్డి తరచూ కొమలికి వచ్చి వ్యవసాయ పనులు చేస్తూ ఉండేవాడన్నారు. ఈనెల 6న కూడా సుంకిరెడ్డి కోమలిలోని అల్లుడి పొలంలో సేద్యం పనులు కోసం వెళ్లాడని, అదే సమయంలో అక్కడికి వచ్చిన అల్లుడు వీరరాఘవరెడ్డితో పొలం పనులు సరిగా చేసుకోకపోతే ఎలా అని మందలించాడని చెప్పారు. కొపగించుకున్న వీరరాఘవరెడ్డి కొడవలితో సుంకిరెడ్డిపై దాడి చేశాడన్నారు. తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సుంకిరెడ్డి 6న చనిపోయాడన్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

గురుకులాల్లో అక్రమాలు జరగలేదు

- బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ



అనంతపురం ఎడ్యుకేషన్: ‘బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గురుకుల పాఠశాలలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. కొందరు పనికట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారు. దీనిపై ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి ఫిర్యాదు చేశాం’ అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఆధారంగా కొర్రపాడు గురుకులంలో ఈనెల 4న సమగ్ర విచారణ చేపట్టామన్నారు. గడిచిన జూన్‌లో విద్యార్థులకు ఉపయోగపడని పాత పుస్తకాలను నిబంధనల మేరకు అమ్మడం జరిగిందని గుర్తు చేశారు. ఈ పాత పుస్తకాలను తీసుకెళ్తున్న వాహనం ఫొటో తీసి ఇప్పుడు సరుకులు తరలిస్తున్నారంటూ కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. విచారణతోనూ అది సరుకులు తరలిస్తున్న వాహనం కాదనేది తేలిందన్నారు. మూన్నెళ్లకిందట గురుకులంలోనే నివాసం ఉంటున్న పార్ట్ టైం వ్యాయామ శిక్షకులు ఉదయం 7 గంటల సమయంలో విద్యార్థినులతో పాటు జడ వేసుకునే సందర్భంలో తీసిన ఫోటోను చూపిస్తూ విద్యార్థినులతో మసాజ్ చేయించుకుంటున్నారని ప్రచారం చేశారన్నారు. అలాంటిదేమీ జరగలేదని విచారణలో వెల్లడైందన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

- రైతులకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యమన్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రైతులకు ఆటంకం లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ చెప్పారు. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో శుక్రవారం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముద్దినాయనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మార్చి నాటికి పూర్తయ్యేలా పనులు వేగవంతం చేయాలని విద్యుత్‌శాఖ ఈఈ శేషాద్రిశేఖర్‌ను ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో రైతులకు ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. ముద్దినాయనపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల వెంకటంపల్లి, మౌక్తికాపురం, కాపర్లపల్లి, ఎగువ తండా, దిగువ తండా, వర్లి తదితర గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం పలువురు రైతులు గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని కోరగా వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ గురురాజ్, ఏఈ సలీం, జెడ్పీటీసీ బొమ్మన్న, సర్పంచ్ చంద్రానాయక్, రాష్ట్ర నృత్య, సృజనాత్మక డైరెక్టర్ బాబురెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివలింగారెడ్డి, నగేష్ నాయక్, వెంకట్రామ్‌నాయక్, సోమశేఖర్, అంజినరెడ్డి, సచివాలయాల కన్వీనర్ భట్టువానిపల్లి ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


ముద్దినాయనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

అత్యాచారం కేసు నమోదు

అనంతపురం క్రైం: ఓ వివాహిత బలహీనతను ఆసరాగా చేసుకుని బ్లాక్ మెయిల్ చేసి లొంగదీసుకోవాలని చూసిన వ్యక్తిపై నాల్గవ పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలమేరకు.. స్థానిక ప్రశాంతి నగర్‌లో చీరలు వ్యాపారం చేసుకునే వివాహితను నాలుగేళ్లుగా నారాయణపురానికి చెందిన హరినాథ్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తూ వచ్చాడన్నారు. ఫొటోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించి శారీరకంగా, ఆర్థికంగా దోచుకున్నాడని చెప్పారు. శ్రీనివాస్‌నగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని హరినాథ్‌రెడ్డి ఆ మహిళను బెదిరించి అక్కడికి పిలిపించుకునేవాడన్నారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

‘జగనన్నకు చెబుదాం’కు స్పందన

పుట్లూరు: మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ‘జగన్నకు చెబుదాం’ కార్యక్రమానికి స్పందన లభించింది. స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 61 వినతులను ప్రజలు అందజేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , శింగనమల ఈఆర్‌ఓ సుధరాణి, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, అనంతపురం ఆర్‌డీఓ జి.వెంకటేష్ ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.

ప్రత్యేక కౌంటర్లు

సమస్యలను తెలుపుకోవడానికి వచ్చే ప్రజల కోసం మండల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా అర్జీలను సిద్ధం చేసి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి అర్జీదారుడికి డిజిటల్ అసిస్టెంట్లు అక్కడే రసీదులను అందజేశారు. అలాగే అర్జీదారులు ఇబ్బందులు పడకుండా వారికి టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, సీఐ సుబ్రమణ్యం పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


డిప్యూటీ కలెక్టర్‌కు అర్జీలిస్తున్న ప్రజలు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇన్‌చార్జ్ సచ్చింద్రకుమార్ పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకాలు అందని వారిలో అర్హులుంటే గుర్తించి లబ్ధి చేకూర్చాలన్నారు. జిల్లాలో సంకల్ప యాత్ర అమలుపై ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవితో కలిసి అధికారులతో సమీక్షించారు. సచ్చింద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఈ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీపీఓ, ఇతర అధికారులను అభినందించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జనవరి వరకు కొనసాగించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి అధికారికి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ చెప్పారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్‌రావు, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, శ్రీదేవి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇహషాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.


రాప్తాడు: మాట్లాడుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా ఇన్‌చార్జ్ సచ్చింద్రకుమార్

రాప్తాడు: మండలం ఎం.బండమీదపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలోనూ సచ్చింద్రకుమార్, జేసీ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది అందిస్తున్న సేవలు బాగున్నాయని ఐసీడీసీ పీడీ శ్రీదేవిని ప్రశంసించారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసన చేసి, అక్కడే ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్స్‌ను పరిశీలించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

అనంతపురం మెడికల్: అనంతపురం, బళ్లారి జిల్లాల వైద్య ఆరోగ్యశాఖాధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లి లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం బళ్లారిలో బళ్లారి కలెక్టర్ అధ్యక్షతన అనంతపురం, బళ్లారి, తుముకూరు, చిత్రదుర్గ జిల్లాల ఆరోగ్యశాఖాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దుల్లో నడుస్తున్న స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉండే గర్భిణులు పక్క జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నట్లు అనుమానాలున్నాయని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో ముందుకెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలకు చెక్ పెడతామన్నారు.


మాట్లాడుతున్న బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ మిశ్రా

మానవత్వం చాటుకున్న ఖాకీలు

- మహిళా కానిస్టేబుల్ వైద్యానికి రూ.7.20 లక్షల సాయం

అనంతపురం క్రైం: అనంత పోలీసులు మానవత్వం చూపారు. అనంతపురం ఎస్పీ, ఎస్టీ సెల్ మహిళా కానిస్టేబుల్ కుళ్లాయమ్మకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. కిడ్నీ మార్పు కోసం ఆమె ఇబ్బందిని పోలీసు సిబ్బంది గుర్తించారు. ఇందులో భాగంగానే కానిస్టేబుల్ మొదలు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వరకూ ఆర్థికసాయం అందించారు. మహిళా కానిస్టేబుల్ కుళ్లాయమ్మకు శుక్రవారం ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కు రూపంలో రూ. 7.20 లక్షలు, నగదు రూపంలో రూ. 50 వేలు కలిపి రూ.7.70 లక్షలను అందించారు. మానవత్వంతో డబ్బు అందించిన ప్రతి ఒక్కరిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, శ్రీనివాసుల నాయుడు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.


బాధిత మహిళా కానిస్టేబుల్‌కు చెక్కు అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులకు సిగ్గుందా?

- విద్యార్థులకు అండగా ఉన్న సీఎం జగన్‌ను విమర్శిస్తారా ?
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ‘గత ప్రభుత్వంలో ఫీజురీయింబర్స్‌మెంట్ అరకొరగానే ఇచ్చేవారు. అదికూడా సక్రమంగా చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను బయట నిలబెట్టిన రోజులున్నాయి. వాటిని ఎలా మర్చిపోతారు’ అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అబద్ధపు హామీలతో విద్యార్థులకు నమ్మకద్రోహం చేశారంటూ సీఎం జగన్‌పై టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంపై నరేంద్రరెడ్డి మండిపడ్డారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నమ్మకద్రోహం అనే పదానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే అన్నారు. 2014లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీనైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షల ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో విద్యార్థులకు ఇచ్చిన అరకొర ఫీజు కూడా కోట్లాది రూపాయలు బకాయిలు పెట్టిపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాశాలల యాజమాన్యాలకు బకాయిలు చెల్లిస్తూ...మరోవైపు పూర్తిస్థాయి ఫీజురీయింబర్స్‌మెంట్ అమలు చేశారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేద విద్యార్థులకు ఇంతకంటే ఏం కావాలని ప్రశ్నించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

తాడిపత్రి అర్బన్: బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించి విఫలమై ఆఖరికి దంపతులపై కత్తితో దాడి చేసి గాయపరిచిన కేసులోని నిందితుడిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్, ఎస్‌ఐ ధరణీబాబుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 29న పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో నివాసముంటున్న అంకిరెడ్డి వెంకట్రామిరెడ్డి, రమాదేవి అనంతపురంలో జరిగే ఓ వివాహానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలోనే యాడికి మండలం గుడిపాడుకు చెందిన అల్లు సతీష్‌నాయుడు ఇంట్లోకి ప్రవేశించి రమాదేవి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్ళే ప్రయత్నం చేశాడు. వెంట తెచ్చుకున్న కత్తితో రమాదేవి గొంతు కోశాడు. వెంకట్రామిరెడ్డి అడ్డురాగా అతనిపై కూడా కత్తితో దాడి చేసి పరారైయ్యాడు. శుక్రవారం స్థానిక సాయితేజా సినిమా థియేటర్ సమీపంలో నిందితుడు అల్లు సతీష్‌నాయుడుని అరెస్టు చేసి అతని వద్ద నుంచి దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. నిందితుడు సతీష్‌నాయుడు పాత నేరస్తుడేనని చెప్పారు. సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగేశ్వర్‌రెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని చిక్కేపల్లిలో శుక్రవారం ఉదయం విద్యుదాఘాతంతో నాగేశ్వర్‌రెడ్డి (47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. నాగేశ్వర్‌రెడ్డి నూతనంగా ఇంటిని నిర్మిస్తున్నాడు. గోడకు నీరుపెట్టేందుకు మేడపైకి వెళ్లి నీరుపడుతున్నారు. అయితే మేడపై ఉన్న జెట్ మోటర్ వైరుపై కాలుమోపడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు ఎస్పీలు

అనంతపురం క్రైం: జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ శుక్రవారం ప్రారంభమైంది. సబ్ డివిజనల్ పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచులు జరిగాయి. ఉదయం కళ్యాణదుర్గం, అనంతపురం జట్ల మధ్య 20 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో అనంతపురం సబ్ డివిజనల్ పోలీసు జట్టు విజయం సాధించింది. సాయంత్రం అనంతపురం రూరల్, గుంతకల్లు పోలీసు సబ్ డివిజన్ల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. గుంతకల్లు సబ్ డివిజనల్ పోలీసు జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్‌ఐలు హరికృష్ణ, రాముడు, ఆర్‌ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్, మగ్బూల్, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో గురువారం రాత్రి భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. ఆ వివరాలను శుక్రవారం ఎస్‌ఐ గంగాధర్ విలేకరులకు తెలిపారు. గురువారం రాత్రి కొడికొండ చెక్‌పోస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా బాగేపల్లి వైపు నుంచి వచ్చిన కారులో 2,832 మద్యం ప్యాకెట్లు (34) బాక్సులు, అలాగే 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అనంతపురానికి చెందిన లింగ లక్ష్మీనారాయణ, బాలకృష్ణలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆరు నెలలుగా బాగేపల్లిలోని రెయిన్‌బో మద్యం షాపు నుంచి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అనంతపురానికి తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. నిఘా ఉంచి నిత్యం తనిఖీలు నిర్వహించాల్సిన సెబ్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే రాష్ట్రంలోకి భారీగా కర్ణాటక మద్యం వస్తోందన్న విమర్శలున్నాయి.

వ్యాపారి ఇంటిని చుట్టుముట్టిన బాధితులు


వ్యాపారి కృష్ణారెడ్డి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కణేకల్లు: నమ్మించి నట్టేట ముంచిన శనగల వ్యాపారులైన తండ్రీ కొడుకులు కృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి సొంతూరైన పెనకలపాడుకు రాగానే బాధిత రైతులు వారిని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. వివరాల్లోకెళితే.. కణేకల్లు మండలంలోని పెనకలపాడుకు చెందిన తండ్రీ కొడుకులు కృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి 20 ఏళ్లుగా శనగల వ్యాపారం చేస్తూ 4 నెలల క్రితం రైతులకు డబ్బివ్వకుండా ఉడాయించిన విషయం తెలిసిందే. సుమారు రూ.10 కోట్ల వరకు శఠగోపం పెట్టినట్లు రైతులు వాపోయారు. అనంతరం వారు రైతులకు ఐపీ నోటీసులు పంపగా... బాధితులు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదుకాగా.... వారు అరెస్ట్ అయి రిమాండ్ నుంచి బయటికొచ్చారు. కేసును విచారిస్తున్న కణేకల్లు పోలీసులు వ్యాపార లావాదేవీలకు సంబంధించి రికార్డులు అడిగారు. ఇంట్లో ఉన్నాయని మీరు అవకాశమిస్తే ఇంటికెళ్లి రికార్డులు తెస్తామని వారు తెలిపారు. కణేకల్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి ఇద్దరు కానిస్టేబుళ్లతో తండ్రీ కొడుకులను ఊరికి పంపారు. వారొచ్చిన విషయం తెలుసుకొన్న బాధిత రైతులు ఇంటి వద్దకెళ్లి ఆందోళనకు దిగారు. కేసు విచారణలో ఉందని మీకు న్యాయం జరిగేలా చూస్తామని సీఐ యుగంధర్ చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం పోలీసులు వారిని రాయదుర్గంకు తీసుకెళ్లారు.

ఆలయంలో చోరీ

యల్లనూరు: మండలంలోని కల్లూరు ఊరుబయట కొండమీద ఉన్న సోమగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. గురువారం అర్ధరాత్రి దుండగులు ఆలయ తలుపులు పగలగొట్టి స్వామి వారి వెండి కిరీటం, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. సీఐ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING : 10th, 12th, B.A, B.Com, B.Sc, M.Com, MBA, BBA, B.Tech., BCA, Veternery/Fisheries/ Dairy Science. (Eligible for Govt Jobs) Cont: ✆ : 73383 76874 [R-214]

REAL ESTATE

TOLET

■ స్టార్ జెంట్స్ వేర్, రఘువీరా టవర్స్ బ్యాక్ సైడ్, Opp: బాబయ్య చికెన్ సెంటర్, అనంతపురము. 34 వేలు రెంట్ (డిపాజిట్ 2.5 లక్షలు+ఫర్నీచర్+గుడ్‌విల్) మంచి రన్నింగ్‌లో ఉన్న షాప్ బాడుగకు కలదు. షాప్ వాల్యూ ₹ 11 లక్షలు. సెల్ : 8341728828. [A-1416]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788961]

WANTED

■ కోచింగ్ సెంటర్‌లో పనిచేయుటకు 1) ఆయా కావలెను. (స్వీపర్ & టాయిలెట్ క్లీనర్) & 2) వంట మనిషి లేదా వంట అసిస్టెంటు కావలెను. సెల్ : 6305387296, అనంతపురము. [A-784485]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-925]

■ డైరెక్ట్ జాబ్ 18–50 సం॥ల మహిళలు/ పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం + భోజనం, జీ॥ 18–30 వేల వరకు. మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను. 8886733008/005 [HA-10840]

■ బాదర బందీలేని స్త్రీ / పురుషులు కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, వంటవారు, ఫ్రీ భోజనం / వసతి. జీతం : 13 – 18 వేలు. # గోల్డెన్ ఓల్డేజ్ హోమ్, ATP. 8333081276. [A-784491]

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 2నెలలు ఉచిత ట్రేనింగ్‌తో పాటు మంచి జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సంప్ర:8143256813. [A-1428]

■ ప్రముఖ NGO లో పనిచేయుటకు మండలాల వారీగా వాలంటీర్స్, మార్కెటింగ్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ యువతీయువకులు కావలెను. సెల్ : 9000977523, 8125797853. [A-784488]

■ గుత్తి రోడ్డు HYD HIGHWAY కి ఆనుకొని ప్యాపిలి రోడ్డుకు దగ్గరగా వున్న Layout నందు పనిచేయుటకు అనుభవం వున్న Civil Enginner డిప్లమో హోల్డర్ ప్యాపిలిలో నివాసం ఉండాలి. Salary: 15,000. Contact: 9440923289. [A-2771]

■ తాడిపత్రి, ఆయుష్ హోమియో స్టోర్స్ నందు పనిచేయుటకు కావలెను. M/F 18-50 Years, Local Only, 6K-10K ✆ 9966865807, 8985731051 [C-1187748]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మరో 30 ఏళ్లు జగనన్న సువర్ణ పాలన



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ పుస్తకాలను వలంటీర్లకు అందిస్తున్న మేయర్ వసీం



ముక్తాపురంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు



పేరూరు- 2 (దుబ్బార్లపల్లి) వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో మరో 30 ఏళ్లు జగనన్న సువర్ణ పాలనే ఉంటుందని మేయర్ వసీం తెలిపారు. శుక్రవారం నగరంలోని 41వ డివిజన్ 60వ సచివాలయం, 33వ డివిజన్ 49వ సచివాలయం, 27వ డివిజన్ 36వ సచివాలయం అశోక్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు గోగుల లక్ష్మిదేవి, సాకే చంద్ర, వెంకటరమణ, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఓబిరెడ్డి, జగదీష్, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, వీరా రామకృష్ణా రెడ్డి, తదితరులు సంక్షేమ, అభివృద్ధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మేయరు మాట్లాడుతూ మరో మూడు నెలలు గడిస్తే ప్రభుత్వం పూర్తవుతుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమమన్నారు. కేవలం చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి పవన్ కళ్యాణ్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిదేవి, దుర్గాదేవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే పేదల సంక్షేమం

కనగానపల్లి: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ముక్తాపురం సచివాలయ పరిధిలోని 1,256 మందికి సుమారు రూ.42.52 కోట్లు అందిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వలంటీర్లు గ్రామంలో ర్యాలీగా వెళ్లి నూతన సచివాలయ భవనం వద్ద వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, సర్పంచ్ ఓబిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, నరసింహమూర్తి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, వెంకటరాముడు, గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్నివర్గాలకూ న్యాయం

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని ఎంపీపీ మీనుగ నాగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పేరూరు-2 సచివాలయం (దుబ్బార్లపల్లి)లో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత టీడీపీ పాలనలో రాక్షస పాలన కొనసాగేదన్నారు. కనీసం బడుగు, బలహీన వర్గాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పార్టీలకతీతంగా అందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అంతకకు ముందు పార్టీ జెండా ఎగురవేసి, ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, రామ్మూర్తి, వెంకటరెడ్డి, మారుతీరెడ్డి, మొండెప్ప, జయచంద్ర, మారెన్న, మచ్చన్న, ముత్యాలు, నాగరాజు, నారాయణ, ఓబలేస్, పెదయ్య, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అతిథులు

అనంతపురం ఎడ్యుకేషన్: యువత ఉపాధి కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.శశాంకమౌళి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో క్యారీనొ అనే సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు, ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బీసాతి భరత్ , రాష్ట్రపతి అవార్డు గ్రహీత బీసాతి జీవన్ కుమార్, పారిశ్రామిక వేత్త సుబ్బరాజు, వెంకట్, క్యారీనొ సంస్థ వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఏటా ఎంతోమంది యువత డిగ్రీలు చేత పట్టుకొని బయటకు వస్తున్నారన్నారు. అందరూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులుగా స్థిరపడాలని కోరుకుంటారేగానీ ఉద్యోగాలు సృష్టించి ఇతరులకు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వై పవన్, ఎంటర్ ప్రెనురార్ రాఘవేంద్ర యాదవ్, భరత్ సాయి, తేజస్విని, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు



కుంటిమద్దిలో రంగనాయక ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రామగిరి: కుంటిమద్ది గ్రామంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగనాయకస్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నట్లు జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ నరేంద్ర శుక్రవారం తెలిపారు. గ్రామంలో పురాతన ఆంజనేయస్వామి (రంగనాయకస్వామి) ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా రంగారెడ్డి, సభ్యులుగా మందా ఓబుళమ్మ, నాగరత్నమ్మ, బెస్త రామాంజి, వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు రమేష్, మందా ఓబులేష్, రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, నాగభూషణ, మురళి తదితరులు పాల్గొన్నా రు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ధనుంజయ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ కె.రాధమ్మ శుక్రవారం భూమిపూజ చేశారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం', పంచాయతీ సాధారణ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. కళ్యాణదుర్గం రోడ్డు ప్రధాన రోడ్డు నుంచి పిల్లిగుండ్లకాలనీలోని దర్గా వరకు 400 మీటర్ల పొడవు 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ధనుంజయయాదవ్, రాధమ్మ మాట్లాడుతూ కక్కలపల్లికాలనీ పంచాయతీ చరిత్రలో లేనివిధంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేయించారన్నారు. దాదాపు ప్రతి వీధికీ రోడ్డు ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమామ్ బీ, వార్డు సభ్యులు సుకుమార్, కవితాబాయి, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు రమేష్, మైఖేల్, నాయకులు రామాంజి, సుబహాన్ పాల్గొన్నారు.

మన వాళ్లందరూ బాగున్నారా!



పూర్వ డీఈఓ సాయిరామ్‌తో ఎంఈఓ గురుప్రసాద్, ఏపీఓ నారాయణస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: ' ఏమండీ జిల్లాలో మనవాళ్లందరూ బాగున్నారా' అని పూర్వ జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ అడిగారు. ఇక్కడ డీఈఓగా పని చేస్తున్న సమయంలో ఆగస్టు 19న తీవ్ర అనారోగ్యానికి గురైన సాయిరామ్‌ను హుటాహుటిన బెంగళూరు తరలించారు. అక్కడ కొద్దిరోజులు చికిత్స తీసుకొని కోలుకున్న తర్వాత హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం జిల్లా నుంచి పెద్దవడుగూరు ఎంఈఓ-2 గురుప్రసాద్, సమగ్ర శిక్ష ఏపీఓ నారాయణస్వామి వెళ్లి ఆయన్ను కలిశారు. సాయిరామ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దేవుడిదయతో దాదాపు ఆరోగ్యంగా కోలుకున్నానని, జిల్లావాసులు చూపిన అభిమానం ఎప్పటికీ మరిచిపోలేనని సాయిరామ్ అన్నారు. మరో 20 రోజులు విశ్రాంతి తర్వాత విధుల్లో చేరతానని చెప్పారు. సాయిరామ్ సతీమణి ఉమ మాట్లాడుతూ తన భర్త అనారోగ్యానికి గురయ్యారని తెలిసి కలెక్టర్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్‌స్కూల్ యజమానులు కుటుంబ సభ్యుడిలా స్పందించారని, వారి అభిమానానికి రుణపడి ఉంటామని చెప్పినట్లు ఎంఈఓ, ఏపీఓ తెలిపారు.

సామాజిక స్పృహతోనే రాణింపు



సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: సామాజిక స్పృహ ఉంటేనే వృత్తిలో రాణిస్తారని గ్రామీణాభివృద్ధి శాఖ విభాగాధిపతి ప్రొఫెసర్ ముని నారాయణప్ప పేర్కొన్నారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమీపంలో ఉన్న సెయింట్ విన్సెంట్ డీ పాల్ వద్ద ఉన్న వృద్ధాశ్రమాన్ని విద్యార్థులు తదితరులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక, నైతిక విలువలను పెంపొందించే దిశగా గ్రామీణ అభివృద్ధి శాఖ కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, సేవా దృక్పథాన్ని పెంపొందించటానికి ఇలాంటి ఫీల్డ్ వర్క్ ఉపయోగపడతాయన్నారు. సమాజంలో నానాటికీ విలువలు మంటగలుస్తున్న వేళ ఇలా తమ ఆశ్రమాన్ని సందర్శించడంపై సెయింట్ విన్సెంట్ డీ పాల్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ, సామాజిక కృషి విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిరోజ్ బాబు, టీచింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రతాప్



ప్రతాప్ రెడ్డిని అభినందిస్తున్న బోధనేతర సంఘం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బోధనేతర సంఘం నూతన అధ్యక్షుడిగా డి.ప్రతాప్ రెడ్డి గెలుపొందారు. బోధనేతర సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. డి.ప్రతాప్ రెడ్డి, హెచ్. ఈశ్వరప్ప అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. ఇందులో డి. ప్రతాప్ రెడ్డికి 102 ఓట్లు, హెచ్. ఈశ్వరప్పకు 64 ఓట్లు దక్కాయి. 38 ఓట్ల మెజార్టీతో ప్రతాప్ రెడ్డి ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా బి.శివశంకర్, జనరల్ సెక్రటరీగా పీ లక్ష్మీనారాయణ ఈ నెల 4న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నరేంద్ర మద్దులను నియమించారు. నూతన బోధనేతర సంఘం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు బి.శివశంకర్‌కు మాజీ ప్రధాన కార్యదర్శి శాంత లింగం , కవిరాజు, రఘోత్తం రెడ్డి, సురేష్ రెడ్డి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు నార్పలలో భూపంపిణీ

శింగనమల: నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని 302 మంది రైతులకు 420.31 ఎకరాలు భూ పంపిణీ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం నార్పలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

బుక్కరాయసముద్రం: కొర్రపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. 7వతరగతి విద్యార్థిని హర్షిత, 8వ తరగతి విద్యార్థిని ఇందు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



పుట్లూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీవైఈఓ శ్రీనివాసులు

పుట్లూరు: క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని డీవైఈఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాల, పుట్లూరు, కొండేపల్లిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. మొబైల్ ఫోన్లకు బానిస కావడం వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. ఎంఈఓ శ్రీదేవి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని స్థానిక తగ్గుదేవాలయం, చిన్న విఠోబ, కన్యకా పరమేశ్వరి, భోగేశ్వరాలయంలో ఉత్పన్న ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో అనంత గజగరుడ లక్ష్మీ నారాయణస్వామి, రుక్మిణీ పాండురంగస్వామి, కన్యకాపరమేశ్వరి, భోగేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పల అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: స్థానిక చెరువుకట్ట అయ్యప్పస్వామి ఉత్సవ పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి అగ్ని గుండ ప్రవేశం జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులు ప్రవేశం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గజేంద్రమోహన్, నాగలింగారెడ్డి, నాగానంద, రాము, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెహరికె ఫైజానే ఉమర్ ఫారుక్ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: తెహరికె ఫైజానే ఉమర్ ఫారుక్ 14వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు తెహరిక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ రెండో రోడ్డులోని మసీదులో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇజ్‌తెమాలో ప్రసంగించడానికి భూసావల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్, కర్ణాటక నుంచి నాసిర్ రజాఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారన్నారు. స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో మహ్మద్ ప్రవక్త (స) వారు ధరించిన దుస్తులు, పవిత్ర కేశాలు భక్తుల సందర్శనార్థం ఉంచుతారన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, కార్పొరేటర్ బాబా, విశ్రాంత ఏఎస్పీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయదారుల అరెస్ట్

అనంతపురం క్రైం: నగరంలోని పలు కాలనీల్లో కర్ణాటక నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, దిగుమతి చేసుకున్న మద్యాన్ని విక్రయిస్తున్న ఏడుగురిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 125 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా నిజరూప పాదదర్శనం



పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండు రంగడు

అనంతపురం కల్చరల్: నగరంలోని రాంనగర్ రుక్మిణీ పాండురంగవిఠల ఆలయంలో కార్తీక ఉత్పత్తి ఏకాదశిని పురస్కరించుకొని రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప పాదదర్శనం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఉదయం జరిగిన కార్యక్రమంలో భక్తులు బారులు తీరి స్వామిని ఆరాదించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దుస్తకర్ తిరుపతిరావు, ఆనంద మహేంద్రకర్ మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కలిగిస్తున్నట్లు తెలిపారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

తైక్వాండోలో ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందనలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థిని భవిష్య

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన నగరంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థినిని భవిష్యను అభినందించారు. శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థిని భవిష్య ఈనెల 1 నుంచి 3 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన తైక్వాండో సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, బంగారు పతకం సాదించిందని కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కోచ్ రామాంజనేయులు, రితీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏవో సాయిలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రైతుకు ఏ అవసరం వచ్చినా ఆర్‌బీకేలను సంప్రదించాలని అనంతపురం రూరల్ ఏవో సాయిలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆలమూరు సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కృషి భవన్‌లో మండల స్థాయి అగ్రిబోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ-క్రాప్ ప్రాధాన్యత, ప్రస్తుత రబీ పంటల నమోదు, ఖరీఫ్ పంట నష్టం అంచనాలు, విత్తనాలు, ఎరువులు పంపిణీ, పశువైద్య సేవలు తదితర అంశాలపై చర్చించారు.

ఉపాధి పనులు కల్పించాలి

అనంతపురం అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో కరువు సహాయక చర్యల్లో భాగంగా ఉపాధి పనులు విరివిగా కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి అన్నారు. ఈనెల 14న విజయవాడలో సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ధర్నా కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కేశవరెడ్డి మాట్లాడారు.

అనంతలో అరుణాచలేశ్వరుడి దర్శనం

అనంతపురం కల్చరల్: నగరంలో పవిత్ర అరుణాచలేశ్వరుడి దర్శనం నమూనాతో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమం జరగనుంది. ఈనెల 11న చివరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని సాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామరెడ్డి ప్రారంభిస్తారని ట్రస్టు వ్యవస్థాపకుడు విజయ్‌సాయికుమార్ తెలిపారు. స్థానిక మూడవరోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వద్ద ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అరుణాచలేశ్వరుని దర్శనం, గిరి ప్రదక్షిణ నమూనాతో భక్తులకు స్వామి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పోస్టర్లు ఆవిష్కరించారు.

శింగనమల ఎస్‌ఐగా విజయభాస్కర్

శింగనమల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణయ్య నాలుగు నెలల క్రితం తిరుపతికి బదిలీ అయ్యారు. దీంతో అనంతపురంలో ఎస్‌బీలో పని చేస్తున్న విజయభాస్కర్‌ను ఇక్కడికి నియమించారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడుతామని కొత్త ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంటర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో జూనియర్ కళాశాలల మధ్య స్పోర్టేక్-2కే23 పేరిట శుక్రవారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ అధికారి నరసింహ రెడ్డి , విశ్రాంత క్రీడా అధికారి (సాప్) వెంకటరమణ, బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పల్లె సింధూర, రిటైర్డ్ కేరళ డీజీపీ శంకర్ రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు, డీన్ సంతోష్ కుమార్ రెడ్డి, బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

రామగిరి: మండల కేంద్రంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్టు కలెక్టివ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని చిన్నారులు, వికలాంగులు, మండల స్థాయి అధికారులు, సంస్థ ప్రతినిధులు హాజరవుతారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



పిల్లర్ కోసం వేసిన ఇనుప చువ్వలను తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా శారదనగర్, శ్రీనగర్ కాలనీ, అశోక్‌నగర్ అలేఖ్య ఫంక్షన్ హాల్ వద్ద చేపడుతున్నట్లు నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి ఆధ్వర్యంలో అనధికార నిర్మాణాలను తొలగింపనకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన పిల్లర్లను గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా టీపీఓ శిరీష మాట్లాడుతూ నిబంధనలకనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి

అనంతపురం సెంట్రల్: రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఉప రవాణా అధికారి వీర్రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కేఎస్ఆర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీఓ సురేష్ నాయుడు, డీఎస్పీ మునిరాజా, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ శాఖ అధికారులు, కేజీఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. డీటీసీ వీర్రాజు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రతి నెలా 35 మంది మరణిస్తున్నారని, 80 మంది వరకూ గాయాల పాలవుతున్నారన్నారు. సీటు బెల్టు పెట్టుకోకపోవడం, మితిమీరిన వేగం, మైనర్లు డ్రైవ్ చేయడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం తదితర కారణాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

మిరప పంట పరిశీలన

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో శుక్రవారం మిరప పంటను జిల్లా ఉద్యాన సహాయ సంచాలకులు బీవీ నరసింహరావు, ఏపీడీ ఫజులున్నీషాబేగం, ఉద్యాన అధికారి శైలజ పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో ప్రస్తుత పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. తామర పురుగు వల్ల కలిగే నష్టాన్ని వివరించడంతో పాటు నివారణ కోసం పిచికారీ చేయాల్సిన మందులను తెలియజేశారు. వీహెచ్ఏ రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727